
ప్రజాశక్తి
మంగళవారం 31 అక్టోబర్ 2023
5
విజయనగరం





ఆస్పత్రిలో బాలుడిని పరామర్శిస్తున్న సిఎం జగన్

క్షతగాత్రులకు ముఖ్యమంత్రి పరామర్శ



అప్పటివరకూ సాఫీగా సాగుతున్న వారి ప్రయాణంలో రైలు ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. బతుకు తెరువుకు పట్నం వెళ్లి పనులు చేసుకునే కూలీలు, తమ బంధువుల ఇళ్లకు, స్వగ్రామాలకు వెళ్తున్న పేదలు మృత్యువాత పడ్డారు. మరికొద్ది సేపట్లో ఇళ్లకు చేరుతామను కున్న వారి బతుకులు పట్టాల మధ్య నలిగి పోవంతో విషాదం నెలకొంది. కుటుంబీకులు, బంధువుల రోధనలతో జిల్లా కేంద్రాస్పత్రి ప్రాంతం హృదయ విదారకరంగా మారింది.

మృతదేహాన్ని తరలిస్తున్న సిబ్బంది

ఒక్కసారి భారీ శబ్దం

రైలు ప్రమాదం జరిగిన సమయంలో భారీ శబ్దం రావడంతో సమీప గ్రామాలైన అలమండ ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. తొలుత ఇంటి నుంచి బయటకు పరుగులు తీశామని, అరగంట దాటిన తర్వాత గ్రామానికి రైలు ప్రమాద బాధితులు తండోప తండాలుగా రావడం మొదలు పెట్టారని తెలిపారు. విషయం తెలుసుకుని యువకులు సంఘటనా స్థలానికి పరుగులు తీశామని అలమండ గ్రామస్తులు తెలిపారు. సంఘటనా స్థలంలో ఏడుపులు, ఆర్తనాదాలు రక్తం మడుగులో భీతిల్లిన ప్రయాణికులను చూసి మనసు చలించి పోయిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

లోపల ఇరుక్కుపోయిన మృతదేహం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్, కోట

రైలు ప్రమాదంలో గాయపడి జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్నాధ్ సోమవారం పరామర్శించారు. బాధితులకు, వారి కుటుంబాలకు అండగా నిలుస్తామని ఈ సందర్భంగా సిఎం హామీ ఇచ్చారు. ఆసుపత్రి వార్డుల్లో ఉన్న మొత్తం 29 మంది క్షతగాత్రులు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, ప్రతీ ఒక్కరి వద్దకూ వెళ్లి పరామర్శించారు. రైలు ప్రమాదం జరిగిన తీరు, వైద్య సదుపాయంపై ఆరా తీశారు. వారిని ఓదార్చారు. అనంతరం మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని, అన్నివిధాలా ఆదుకుంటామని తెలిపారు. ప్రమాదం జరిగిన తీరును, తీసుకున్న సహాయ చర్యలను మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, రైల్వే ఉన్నతాధికారులు సిఎంకు వివరించారు.

అన్ని విధాలా ఆదుకుంటాం : బొత్స

జిల్లా సర్వజన ఆసుపత్రిలో క్షతగాతులను మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీరఘురాజు, పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్‌పి దీపికా పాటిల్ పరామర్శించారు. అనంతరం మీడియాతో మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ ఆసుపత్రిలో 29మందికి వైద్యం అందిస్తున్నారని తెలిపారు. నలుగురి పరిస్థితి తీవ్రంగా ఉందని, వారికి అన్ని విధాలా వైద్యం అందే విధంగా వైద్య శాఖా అధికారులకు ఆదేశించామని తెలిపారు. 13 మంది చనిపోయారని, వారిలో ఒకరు రైల్వే ఉద్యోగి కావడం, విశాఖ ఆస్పత్రిలో చనిపోవడం వల్ల రైల్వే శాఖ వారి స్వాధీనంలో ఉందని తెలిపారు. 12 మంది మృతదేహాలకు ఇక్కడ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం ఆయా కుటుంబాలకు అందించామన్నారు.

మెరుగైన వైద్యసేవలందించాలి : సిపిఎం

రైలు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులకు మెరుగైన వైద్య సేవలందించాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. క్షతగాత్రులను, కుటుంబ సభ్యులను ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్య నారాయణతో కలిసి పరామర్శించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ సలందతో మాట్లాడి బాధితులకు అందుతున్న వైద్యం గురించి తెలుసు కున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రైలుప్రమాదం జరగడం చాలా బాధాకరమని అన్నారు. క్షత గాత్రులలో పలువురికి తీవ్రమైన దెబ్బలు, ఇద్దరికి మెదడకు దెబ్బలు తగిలా యన్నారు. వారి వెంట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, టివి రమణ, నాయకులు జి.శ్రీనివాసరావు, పి.రమణమ్మ, ఎ.జగన్మోహన్, పి.రామ్మోహన్, బి.రమణ పాల్గొన్నారు.

పట్టాలపై నలిగిన బతుకులు



నుజ్జునుజ్జయిన రైలు భోగీలు

- 13కు చేరిన రైలు ప్రమాద మృతులు
- కుటుంబీకులకు మృతదేహాలు అప్పగింత
- క్షతగాత్రులను పరామర్శించిన సిఎం, మంత్రులు, సిపిఎం, టిడిపి నాయకులు

ప్రజాశక్తి - జామి

రెండు రైళ్లు ఢీకొన్న ఘటనలో మృతి చెందిన వారి సంఖ్య 13కు చేరింది. 40 మంది వరకు గాయపడినట్లు అధికారులు లెక్కలు తేల్చారు. మృతుల్లో ఎక్కువ మంది కూలి పనులు చేసుకొని జీవనం సాగించేవారే కావడంతో ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదం అలముకుంది. మృతుల్లో ఏడుగురు విజయనగరం జిల్లా వారు కాగా, ముగ్గురు శ్రీకాకుళం, ఇద్దరు విశాఖకు చెందిన వారు ఇద్దరు, కర్నూలుకు చెందిన వారు ఒకరు ఉన్నారు. జిల్లాకు చెందిన మృతుల్లో గరివిడి మండలం కాంపు శంబాం, గదబవలసకు చెందిన ఇద్దరు, శ్రీకాకుళం జిల్లా జి.సింగడాంకు చెందిన ఇద్దరు ఉండడంతో ఆయా మండలాల్లో విషాదఛాయలు నెలకొన్నాయి. రాయగడ పాసింజర్ రైలు డ్రైవర్, లోకోపైలెట్, పలాస రైలుగార్డు మృతి చెందడంతో రైల్వే ఉద్యోగుల్లో సైతం విషాదం అలముకుంది. గార్డు ఎం. శ్రీనివాసరావుది మన్యం జిల్లా. విజయనగరానికి చెందిన సతీష్ మృతుల్లో ఉన్నారు. సతీష్‌కు ఇటీవల వివాహం కావడంతో ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

కంటకాపల్లి-అలమండ మధ్య రైల్వేట్రాక్‌పై ఆగి ఉన్న విశాఖ-పలాస పాసింజర్ రైలును, ఆ వెనుక వస్తున్న విశాఖ-రాయగడ పాసింజర్ రైలు ఢీకొన్న విషయం తెలిసిందే. పట్టాలు తప్పిన వీటి బోగీలు పక్క ట్రాక్‌పై ఉన్న గూడ్సురైలు బోగీలపైకి దూసుకెళ్లడంతో పట్టాలు పైకి లేచాయి. ఈ ప్రమాదంలో ఆదివారం రాత్రి 10 మంది మృతదేహాలను బయటకు తీసిన సహాయక బృందాలు... సోమవారం ఛిద్రమైన రైలు భోగీలను కట్ చేసి రాయగడ పాసింజర్ రైలు లోకో పైలెట్ మృతదేహంతో పాటు మరో ఇద్దరి మృతదేహాలకు వెలికితీశాయి. రైలు ప్రమాదంలో మృత్యువాత పడ్డవారిలో, క్షతగాత్రులైన వారిలో కూలి పనులు చేసుకునే వారే ఎక్కువ. ప్రమాదం జరిగిన సమయంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పరుగున వెళ్లి సహాయక చర్యలు చేపట్టడంతో కొంత వరకు ప్రాణ నష్టాన్ని తగ్గించారని బాధితులు చెబుతున్నారు.

రైల్వే జిఎం ఆధ్వర్యాన ట్రాక్ పునరుద్ధరణ

కొత్తవలస : రైల్వే జిఎం మనోజ్ శర్మ, వాల్తేరు డిఆర్ఎం సౌరబ్ ప్రసాద్ నేతృత్వంలో ఆదివారం రాత్రి నుంచి సిబ్బంది హుటాహుటిన దెబ్బతిన్న బోగీలను తొలగింపు చర్యలు చేపట్టారు. ఇప్పటికే ఈ లైన్ మీదుగా ప్రయాణించే పలు రైళ్లను దారిమల్లించడంతో పాటూ వివిధ రైళ్ల రాకపోకలను రద్దుచేస్తూ రైల్వే శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపధ్యంలో ట్రాక్ పునరుద్ధరణ పనులను భారీ క్రైన్ల సహకారంతో ముమ్మరం చేశారు. సోమవారం మధ్యాహ్నం నాటికి ట్రాక్ పై శిధిలాలను పూర్తిగా తొలగించి, రెండు ట్రాక్‌లను పునరుద్ధరించారు. దీంతో సాయంత్రం నుంచి పలు రైళ్లు ఆలస్యంగా నడిచాయి.

బాధితులకు ఆదుకుంటాం : బూడి

ఘటనా స్థలంలో సహాయక చర్యలను డిప్యూటీ సిఎం మంత్రి బూడి ముత్యాలు నాయుడు పరిశీలించారు. ప్రమాద బాధితులకు ప్రభుత్వం ఆదుకుంటుందని హామి ఇచ్చారు. ముఖ్య మంత్రి ఆదేశాలతో హుటాహుటిన సహాయక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆయన వెంట స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఉన్నారు.



సహాయ చర్యల్లో యువత

లక్కవరపుకోట : గాయపడిన క్షతగాత్రులను కాపాడేందుకు కొత్తవలస మండలం చిన్నరావుపల్లి గ్రామానికి చెందిన యువత సహాయ చర్యలు చేపట్టారు. రాయగడ పాసింజర్ లో విశాఖ నుండి అలమండ వస్తున్న దివాకర్ ప్రమాద సమాచారాన్ని చిన్నరావుపల్లికి చెందిన తన స్నేహితుడు సింగంపల్లి ప్రసాద్‌కు ఫోన్‌లో తెలియజేశాడు. దీంతో అతని స్నేహితులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. సీట్ల మధ్యలో ఇరుక్కుపోయిన క్షతగాత్రులను బయటకు తీసి సహాయ చర్యలు చేపట్టారు. రైల్వే ట్రాక్ వరకు అంబులెన్స్ రాలేనందున సుమారు కిలోమీటర్ పైబడి గాయపడిన వారిని మోసుకొని అంబులెన్స్‌కు చేరవేశారు. భీమాలి, అలమండ గ్రామస్తులు ప్రయాణికులకు తాగునీరు అందించారు. రైల్లో పూర్తిగా ఇరుక్కుపోయిన క్షతగాత్రులను గ్యాస్ కట్టర్ల ద్వారా అడ్డమున్న భాగాలను కట్ చేసి గాయపడినవారిని బయటకు తీయడం జరిగేది అంటూ యువత తెలిపారు.

ఆదివారం కావడంతో..

ప్రమాదం ఘటన ఆదివారం జరగడంతో ఒకింత ఈ ప్రాంత ప్రజల ప్రాణాలను నిలబడ్డాయి. వాస్తవానికి పలాస, రాయగడ పాసింజర్లను ఎక్కి విశాఖపట్నం కూలి పనులకు జామి, కొత్తవలస మండలాలకు చెందిన పలు గ్రామాల పేదలు వెళ్తుంటారు. విశాఖ జిల్లా పద్మనాభం మండలం చెందిన పలు గ్రామాలు ప్రజలకు ఉపాధి విశాఖపట్నమే. దీంతో ప్రతి రోజూ రైలుపై విశాఖకు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకుంటారు. ఆదివారం కావడంతో వేలాది మంది పనులకు వెళ్లని పరిస్థితి. ఈ నేపథ్యంలోనే ఈ ప్రాంతం కూలీల ప్రాణాలకు ముప్పు తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకుంటున్నారు.

హృదయ విదారకరం

క్షతగాత్రులకు సర్వజన ఆస్పత్రిలో చికిత్స

కంటకాపల్లి సమీపంలో జరిగిన రైలు ప్రమాదంలో గాయపడిన వారిలో 29 మంది జిల్లా కేంద్ర సర్వజన ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నారు. క్షతగాత్రుల వివరాలకు వారి కుటుంబ సభ్యులకు తెలియక కొందరు ఇబ్బందులు పడుతుంట.. సమాచారం తెలిసిన వారు ఆస్పత్రికి చేరుకొని సపర్యలు చేస్తున్న వారు కొందరు. మరోవైపు మృతదేహాలకు ఆస్పత్రి మార్చురీకి చేరుకోవడంతో ఆ ప్రాంతం ఆర్తనాదాలతో మార్మోగి పోయింది. మరోవైపు పరామర్శకు వస్తున్న అధికారులకు, పలు పార్టీల నాయకులకు అంతే ఆవేదనతో బాధితులు జరిగిన సంఘటనను వివరించడం తో వారి హృదయాలు బరువెక్కాయి.

- ప్రజాశక్తి, విజయనగరంకోట, టౌన్



ఆస్పత్రి వద్ద తీవ్ర విషాదంలో మృతుల బంధువులు

తల్లిదండ్రులు, కుమార్తెకు గాయాలు

విశాఖలో గాజువాకకు చెందిన జక్కలి వెంకట రమణ, భార్య బంగారుతల్లి, ఐదేళ్ల కుమార్తె కోమలి రైలు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందు తున్నారు. తల్లి తీవ్రంగా గాయపడగా, చిన్నారి కోమలి చేయి విరిగి పోయింది. ఈనేపథ్యంలో ముగ్గురూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిని చూసిన వారి హృదయాలు చలించిపోయాయి.



రమణ కుటుంబాన్ని పరామర్శిస్తున్న సిపిఎం నేతలు బివి రాఘవులు, వి.శ్రీనివాసరావు

కుటుంబ సభ్యులకు సమాచారం లేక..

పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలంలోని పెదవంగర గ్రామానికి చెందిన సవర బుజ్జి (16) తలకు తీవ్ర గాయమై ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఉపాధి కోసం కర్నాటకలో పనిచేస్తున్న ఆమె.. అధోనిలో పనిచేస్తున్న తన అన్న రాయ్యప్పతో కలిసి స్వగ్రామం వస్తోంది. ఇంతలో ప్రమాదం జరగడంతో ఇద్దరూ గాయపడ్డారు. ఆమె అన్నయ్యను విశాఖ కెజిహెచ్‌కు తరలించగా, బుజ్జిని విజయనగరం తరలించారు. ఆమె సమాచారం కుటుంబ సభ్యులకు తెలియక పోవడం, ఆమె చెప్పిన ఫోన్ నెంబరు పనిచేయకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఆస్పత్రిలో దీనంగా తమ వారి కోసం ఎదురుచూస్తున్న ఘటన అందరినీ కలచివేసింది. విషయం తెలుసుకున్న ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు ఆమె కుటుంబీలకు సమాచారం ఇవ్వడంతో సాయంత్రం వారు ఆస్పత్రికి చేరుకున్నారు.



చికిత్స పొందుతున్న బుజ్జి

ఆ పాప ధైర్యం అమోఘం

చిత్రంలో కనిపిస్తున్న ఈ పాప పేరు మహంతి తేజ(8). జి.సిగడాంకు చెందిన ఈ పాప చుట్టాలింటికి పెదనాన్నతో కలిసి వెళ్లింది. తిరిగి ప్రయాణంలో వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో రెండు కాళ్లకు దెబ్బ తగిలి రక్తం కారుతున్నా భయపడకుండా పక్కనే ఉన్న వారి సెల్ తీసుకుని తన తండ్రికి ఫోన్ చేసి ఇక్కడెక్కడో రెండు రైళ్లు ఢీకొన్నాయి. నా కాళ్లకు దెబ్బలు తగిలాయి. వెంటనే మీరు రండి అని తన తండ్రితో పాటు ఆ గ్రామానికి సమాచారం ఇచ్చింది. ఇంతటి భీకర పరిస్థితుల్లో కాళ్లకు రక్తం కారుతున్నా బయపడకుండా ఆ పాప తన తండ్రికి ధైర్యంగా సమాచారం ఇవ్వడం గొప్ప విషయమని తోటి ప్రయాణికులు చెబుతున్నారు.



పెద్దపెద్ద శబ్దాలు..

పనిమీద విశాఖ వెళ్లి, తిరిగి ప్రయాణంలో భాగంగా రైలు ఎక్కాను. కంటాకాపల్లి దాటిన తరువాత ఒక్కసారిగా రైల్లో కరెంటు పోయింది. పెద్ద పెద్ద శబ్దాలతో అరుపులు, కేకలు వినబడ్డాయి. ఏమైందో తెలియక కంగారు పడుతున్న లోపే నా కుడి చేయి బరువెక్కింది. మరోవైపు చేతి నుంచి రక్తం కారిపోతుంది. ఇంతలో పెద్దగా ఏడుపులు వినిపించాయి. నేను కూడా పెద్దగా కేకలు వేశాను. కొంత సమయం తర్వాత స్థానికులు వచ్చి నన్ను బలవంతంగా బయటికి తీశారు.

- నిరాకర్ మిశ్రా, మరదరాజపురం, పలాస మండలం



పోటెత్తిన యాత్రికులు

పైడితల్లమ్మను దర్శించుకున్న అశోక్, కోలగట్ల, మజ్జి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పైడితల్లమ్మ ఉత్సవ సందడి మొదలైంది. తొలిరోజు సోమవారం తొలేళ్ల ఉత్సవం వైభవంగా జరిగింది. అమ్మవారి దర్శనానికి యాత్రికులు పోటెత్తారు. ఉదయం నుంచి దర్శనం కోసం కిలోమీటర్ల క్యూలో నిలబడ్డారు. ఘటాలతో మొక్కులు తీర్చుకునేందుకు భారీగా తరలివచ్చారు. ఆలయం నుంచి రోడ్డుకు కుడి వైపు అర్బన్ బ్యాంకు వరకు యాత్రికులు క్యూలో ఉన్నారు. ఎంజి రోడ్డు వైపు చందన బ్రదర్స్ షాపు వరకు బారులుతీరారు. తొలేళ్ల ఉత్సవం సందర్భంగా విచిత్ర వేషధారణలు, వాయిద్యాలతో పండగ శోభ నెలకొంది.

ఆలయ ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతి రాజు కుటుంబ సభ్యులతో కలిసి పట్టువస్త్రాలు సమర్పించారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. డిసిఎంఎస్ ఛైర్‌పర్సన్ అవనాపు భావన, విక్రమ్ దంపతులు, బంధుమిత్రులతో కలిసి ఘటాలతో ఆలయానికి చేరుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.



ఆలయంలో పూజలు చేస్తున్న అశోక్ దంపతులు



ఘటాన్ని తీసుకెళ్తున్న మహిళ

పట్టువస్త్రాలు సమర్పించిన అశోక్

పైడితల్లమ్మ పండగ సందర్భంగా సోమవారం అమ్మవారికి ఆలయ ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు పట్టు వస్త్రాలను సమర్పించారు. కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అశోక్ మీడియాతో మాట్లాడుతూ పైడితల్లమ్మ ముందు అందరూ సాధారణ భక్తులేనని, అధికారం, అహం అమ్మవారి ముందు చూపించకూడదని వ్యాఖ్యానించారు. తానెప్పుడూ మర్యాదలకు పెద్దపీట వేయలేదన్నారు. గతేడాది అనేక అపశ్రు తులు చోటుచేసుకున్నాయని, ఈ ఏడాది అలా జరగ కుండా ఉంటుందని ఆశిస్తున్నానని చెప్పారు. సిరి మాను సరైన సమయానికి తిప్ప గలిగితే యాత్రికులు సంతోషిస్తారని, ఈ విషయంలో ప్రభుత్వం బాగా పనిచేయాలని సూచించారు. విజయనగరం ఉత్సవాలకు అందరికీ ఆహ్వానం ఇవ్వాలా? వద్దా అనేది ఎమ్‌పి, ఎమ్మెల్యేల నిర్ణయమని అభిప్రాయపడ్డారు.

రైల్వే వ్యవస్థ పనితీరు మెరుగుపడాలి

జిల్లాలో రైలు ప్రమాదం జరగడం విచారకరమని అశోక్ అన్నారు. మృతుల కుటుంబాలను, గాయపడిన వారిని మానవత్వంతో ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అమాయకుల ప్రాణాలు పోకుండా ప్రభుత్వం రైల్వే వ్యవస్థ పనితీరు మెరుగుపర్చాలని, ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైలు ప్రమాద ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి, తప్పులను సరిదిద్దాలని డిమాండ్ చేశారు.

సామాజిక యాత్ర కాదు.. సంహారయాత్ర

- ప్రజారక్షణ భేరిలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు
- అమలుకాని హామీలపై సిఎం వివరణ ఇవ్వాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు
- ఉత్సాహంగా ప్రారంభమైన బస్సు యాత్ర
- పార్వతీపురం, కురుపాంలో ఘన స్వాగతం



ప్రదర్శనలో పాల్గొన్న సిపిఎం నేతలు బివి రాఘవులు, వి.శ్రీనివాసరావు, నాయకులు, పార్టీ శ్రేణులు



సిపిఎం నాయకులకు తిలకం దిద్ది స్వాగతం పలుకుతున్న మహిళలు


జిల్లాలో సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా రక్షణ బేరి బస్సుయాత్ర ఉత్సాహాన్ని నింపింది. గిరిజన, రైతాంగ, ఉద్యోగ, కార్మిక వర్గాలను ఆలోచింప చేసింది సీతంపేటలో ప్రారంభమైన బస్సుయాత్ర పాలకొండ, కురుపాం మీదుగా పార్వతీపురం వరకు సాగింది. కురుపాం పార్వతీపురం కేంద్రాల్లో యాత్ర బృందానికి ఘన స్వాగతం లభించింది. కురుపాంలో గిరిజన సాంప్రదాయ నృత్యం డప్పు వాయిద్యాలతో స్వాగతం పలికారు. పార్వతీపురంలో కోలాటంతో స్వాగతం పలుకుతూ నాయకులకు తిలకం దిద్దారు. ఈ రెండు చోట్ల సాగిన ప్రదర్శనలలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక నినాదాలు మారు మోగాయి. ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా కార్మిక గిరిజన రైతాంగ వ్యతిరేక విధానాలపై ప్రజానాట్యమండలి కళాకారులు నృత్యాలు ప్రదర్శించారు.

ప్రజాశక్తి -కురుపాం, పార్వతీపురం

ఈ సందర్భంగా కురుపాం, పార్వతీపురంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రెడ్డివేణు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె. అవినాష్ అధ్యక్షతన జరగిన బహిరంగ సభల్లో వక్తలు మాట్లాడారు. తొలుత సిపిఎం పోలీస్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి చేపడుతున్నది సామాజిక సాధికార యాత్ర కాదని సామాజిక సంహార యాత్ర అంటే సరిపోతుందని కితాబు ఇచ్చారు. రాష్ట్రంలో అన్ని తరగతులనూ మోసం చేస్తున్న బిజెపికి వంతపాడి తిరిగి అదే ప్రజలకు సాధికారత కల్పిస్తున్నామన్నడం సిగ్గుచేటు అన్నారు. సిఎం జగన్ వైఖరి వల్ల రాష్ట్రం మునుపెన్నడూ లేనంత నిర్లక్ష్యానికి గురైందని అన్నారు. టిడిపి కూడా రాజకీయంగా ఎదుర్కోవడం తప్ప ప్రజల సమస్యలు పట్టలేదని విమర్శించారు. ఈ విషయాలను ప్రజలకు తెలియజేసేందుకు ప్రజారక్షణ బేరి పేరిట తమ పార్టీ ఆధ్వర్యంలో బస్సు యాత్ర చేపడుతున్నామని తెలిపారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు సిఎం జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు కాలేదని విమర్శించారు. తోటపల్లి ,జంఝావతి సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని చెప్పినా, వాటికి అందుకు అనుగుణంగా నిధులు కేటాయించలేదన్నారు. 14 ఏళ్ల క్రితం సిపిఎం ఒత్తిడితో తలపెట్టిన పూర్ణపాడు లాబేసు వంతెన నిర్మాణాన్ని కూడా చేపట్టలేదని, దీంతో గిరిజనులు ఎంతో ప్రయాస పడుతున్నారని అన్నారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే పుష్ప శ్రీవాణి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వారు నివాసం ఉంటున్న మేరంగి రోడ్లు కూడా దారుణంగా ఉండడం సిగ్గుచేటు అన్నారు. ఎమ్మెల్యేలు, మంత్రుల నిర్లక్ష్యం వల్ల సీతానగరం బ్రిడ్జి నిర్మాణం కూడా అసంపూర్తిగానే మిగిలిపోయిందని విమర్శించారు.

ఏజెన్సీలు ఏనుగుల విధ్వంసంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నా పట్టించుకోలేదన్నారు ఏజెన్సీలో జీడి పిక్కల ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు పార్వతీపురంలో తాగునీరు, ట్రాఫిక్ సమస్య పై ఇచ్చిన హామీలు నెరవేరలేదని గుర్తు చేశారు. సీతానగరంలో ఎన్‌సిఎస్ సుగర్స్ ను సహకార రంగంలోకి తీసుకొస్తామని చెప్పినప్పటికీ రైతులు బకాయిల తీర్చేందుకు ఏకంగా పరిశ్రమ భూమినే విక్రయించారని అన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత పార్వతీపురం మన్యం జిల్లాలో ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా చేపట్లేదని ఆవేదన వ్యక్తంచేశారు. స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులు రియల్ ఎస్టేట్ వ్యాపారులుగా మారిపోయారని విమర్శించారు. జిల్లాలో సమస్యలపైన, అభివృద్ధి కోసం సిపిఎం నిర్దిష్టమైన ప్రణాళికతో ప్రజల ముందుకు సాగుతుందని అన్నారు. ఇందుకు ప్రజలు తోడైతే మేలు జరుగుతుందని అన్నారు. ఐద్వా నాయకులు హైమావతి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు భద్రత లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సంఘం రాష్ట్రఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 420 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు ఉన్నాయని అన్నారు. కానీ ప్రభుత్వం కరువు మండలాలుగా గుర్తించేందుకు మీనమేషాలు లెక్కిస్తుందన్నారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, కె.సుబ్బరావమ్మ, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.అశోక్, దడాల సుబ్బారావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం. తిరుపతిరావు వై .మన్మధరావు, కె. గంగునాయుడు, జిల్లా కమిటీ సభ్యులు ఎం.శ్రీనివాసరావు, కోరాడ ఈశ్వరరావు, ఎంపిటిసిలు ఎం.రమణ, బి.ఎర్రమ్మ తదితరులు పాల్గొన్నారు.



కురుపాం సభకు హాజరైన జనం, మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు



లైటింగ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతాం

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

నగర సుందరీకరణకు అవసరమైన అన్ని చర్యలనూ తీసుకుంటున్నామని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. నగరంలోని మయూరి జంక్షన్ నంచి అంబేద్కర్ జంక్షన్ వరకు ఏర్పాటు చేసిన లైటింగ్‌ను, మయూరి జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన కాఫీ కప్ విత్ వాటర్ ఆకృతిని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం సుందరంగా తీర్చిదిద్దిన ఆచంట గార్డెన్‌ను ప్రారంభించారు. ఆచంట గార్డెన్‌లో ఏర్పాటు చేసిన వ్యాయామశాలను, బుద్ధుని విగ్రహాన్ని, విజయనగరం విద్యుత్ నామఫలకాలను ఆవిష్కరించారు. విద్యుత్ దీపాలను ప్రారంభించారు. దీంతో అంబేద్కర్ జంక్షన్ నుంచి మయూరి జంక్షన్ వరకు విద్యుత్ దీపాలతో కాంతిలీనమైంది. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ నగరపాలక సంస్థగా రూపాంతరం చెందిన తర్వాత అవసరమైన అన్ని హంగులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే ప్రధాన జంక్షన్‌లను అభివృద్ధి చేశామని చెప్పారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆకృతులను ప్రారంభించడంతో నగరం అంతా విద్యుత్ కాంతులతోనూ వివిధ రకాల ఆకృతులతో ఆకర్షణీయంగా దర్శనమిస్తోందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, ఎమ్మెల్సీ సురేష్ బాబు, మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, లయ యాదవ్, నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్ శ్రీ రాముల నాయుడు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

అద్దె బస్సు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ అద్దె బస్సు కార్మికుల సమస్య పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ డిమాండ్ చేశారు. సోమవారం ఆర్‌టిసి కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ యూనియన్ ఆధ్వ ర్యంలో పట్టణంలోని ఆర్‌టిసి డిపో మేనేజర్ కె రమేష్‌కి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం మద్దిల రమణ మాట్లాడుతూ ఎస్‌కోట ఆర్‌టిసి డిపోలో కార్మికులు ఏళ్ల తరబడి పనిచేస్తూన్నారని వీరికి ఎక్కడా లేని విధంగా ఆర్‌టిసి కార్మికులను 3 నుండి 50 వరకు ముక్క ముక్కలుగా విడగొట్టి వందల మందిని ప్రజా రవాణా సంస్థ అప్పగించిం దన్నారు. వీరికి కనీస వేతనాల జిఒలను సవరించకుండా పాత వాటినే అమలుచేస్తు న్నారన్నారు. కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి నెల 10వ తేదీలోపు జీతాలివ్వాలన్నారు. కొంతమంది కార్మికులకు 3 నుంచి 4 నెలల వరకు జీతాలు చెల్లించడం లేదన్నారు. మార్కెట్లలో నిత్యావసర సరుకుల ధరలు, ఇంటి అద్దెలు, విద్యా, వైద్యం, కరెంటు బిల్లుల ఖర్చు భారీగా పెరుగుతున్నా యన్నారు. అయినప్పటికీ వీరికి కనీస వేతనం ఇవ్వడం లేదన్నారు. డిపోలో మహిళా లైంగిక వేధింపుల కమిటి ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

10 నుంచి సైన్స్ సంబరాలు

బొబ్బిలి : చెకుముకి సైన్స్ సంబరాలు నవంబర్ పదో తేది నుంచి ప్రారంభమవుతాయని జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు పోల సత్యంనాయుడు తెలిపారు. గొల్లపల్లి శ్రీవేణుగోపాల మున్సిపల్ పాఠశాలలో సోమవారం చెకుముకి సైన్స్ సంబరాలు వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతి పాఠశాలలో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సైన్స్ సంబరాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ప్రజాశక్తి - భోగాపురం

పాఠశాలల అభివృద్ధికి వైసిపి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని ఎంపిపి అనూష రెడ్డి అన్నారు. మండలంలోని రావడ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజనం పథకం నిర్వాహకులకు సోమవారం వంట సామాగ్రి, విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లను ఆమె చేతులు మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి హయాంలో పాఠశాలలు నాడు నేడు కార్యక్రమంలో ఎంతగానో అభివృద్ధి చెందాయన్నారు. వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ పేద కుటుంబాలను ఆర్థికంగా పైకి తీసుకురావాలన్నదే ఈ ప్రభుత్వ లక్ష్యమన్నారు. విద్య కోసం ప్రభుత్వం కొన్ని కోట్లు ఖర్చు పెడుతోందన్నారు. అందుకు విద్యార్థులంతా చక్కగా చదివి ఉన్నత స్థాయిలో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అప్పలనాయుడు, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తి ముఖ్యం : జెడ్‌పిటిసి

ప్రజాశక్తి- గజపతినగరం

క్రీడా పోటీలలో గెలుపోటముల కన్నా క్రీడా స్ఫూర్తి ముఖ్యమని జెడ్‌పిటిసి గార తౌడు అన్నారు. సోమవారం గజపతినగరం బాలికొన్నత పాఠశాల ప్రాంగణంలోని క్రీడ మైదానంలో జిల్లాస్థాయి బాల్ బ్యాడ్మింటన్ అండర్ 14, 17 బాలుర, బాలికల ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఈ పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచి, జిల్లా జట్లలో స్థానం సంపాదించుకోవాలన్నారు. అనంతరం పాఠశాలకు మంజూరైన క్రీడ సామాగ్రి, వంట సామగ్రిని ఆయన ప్రధానోపాధ్యాయులు రమేష్ కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒలు ఎస్.విమలమ్మ, సాయి చక్రధర్, ఉపసర్పంచ్ మండల సురేష్, మాజీ సర్పంచ్ కందుల చిన్నయ్య స్వామి, రేగ సురేష్, ఎస్ఎంసి చైర్మన్ లక్ష్మణ, ఎస్‌జిఎఫ్ సెక్రెటరీ ఎల్వీ రమణ, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు వెంకట నాయుడు, బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా సెక్రెటరీ తోనంగి శ్రీనివాసరావు, నియోజకవర్గ ఇంచార్జ్ చింత సత్యనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయులు దారరాజు, గద్ద గురు నాయుడు, టి. శ్రీనివాసరావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

కార్యదర్శులతో సమీక్ష

ప్రజాశక్తి-తెర్లాం

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులతో ఎంపిడిఒ ఎస్.రామకృష్ణ సమీక్షించారు. ఆరోగ్య సురక్ష, ఉపాధి హామీ, సంక్షేమ పథకాల ఇకెవైసి, తదితర అంశాలపై సమీక్షించారు. మండలంలో 208 మందిని మెరుగైన వైద్య సేవల కోసం పంపించినట్లు తెలిపారు. వారి వివరములు మంగళవారం సాయంత్రంలోపు మండల కార్యాలయంలో సమర్పించాలని ఆదేశించారు.

వేపాడ : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ సమీక్ష నిర్వహించారు. పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని ఆయన సూచించారు. జగనన్న సురక్ష ఆరోగ్య కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సమావేశంలో ఇఒపిఆర్‌డి ఉమ పాల్గొన్నారు.

బొగ్గు అక్రమ రవాణా

శృంగవరపుకోట : మండలంలోని బొడ్డవర పంచాయతీ గాదిలలోవ గ్రామం నుంచి ప్రతిరోజూ పెద్దఎత్తున బొగ్గు విజయనగరానికి తరలుతోంది. శనివారం రాత్రి స్థానిక యువత ఈ విషయంపై విలేకరులకు సమాచారం అందించారు. అక్కడకు వెళ్లి చూడగా బొగ్గుల మూటలతో ద్విచక్రవాహనాలు కనిపించాయి. గంట్యాడ మండలం తాటిపూడి, ఎస్.కోట మండలం ముషిడిపల్లి గ్రామాలకు చెందిన 50 మందికి పైగా అడవిలో చెట్లను కాల్చి బొగ్గుగా మార్చి రవాణా చేస్తున్నారని యువకులు చెబుతున్నారు. డిమాండ్ బట్టి రూ.800 నుంచి రూ.వెయ్యికు అమ్ముతున్నారని తెలిపారు. ఈ విషయం అటవీశాఖ అధికారులు, సిబ్బందికి తెలిసినా పట్టించుకోవడం లేదని వాపోయారు.

బొగ్గు వ్యాపారం వల్ల అడవులు దెబ్బతింటాయని తెలిపారు.

సిరిమానోత్సవానికి వేళాయె

● 3 గంటలకు ప్రారంభం ● 2015 మందితో పటిష్ట బందోబస్తు

ప్రజాశక్తి - విజయనగరం టౌన్, కోట

ఉత్తరాంధ్రుల ఇలవేల్పుగా భావించే విజయనగరం పైడితల్లమ్మ సిరిమాను సంబరానికి సర్వం సిద్ధమైంది. అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. సుమారు 10 లక్షల మంది జనం వస్తారని భావిస్తున్నారు. అందుకు తగ్గట్టే చదురు, వనంగుడుల వద్ద ఏర్పాట్లు చేశారు. ఈ ఏడాది పైడితల్లమ్మ పండగకు యాత్రికుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నందున మంగళవారం తెల్లవారి 3 గంటల నుంచి ఆలయ దర్శనం కల్పించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకే సిరిమాను సంబరం ప్రారంభం కానుంది. ఆలయ ప్రధాన పూజారి బంటుపల్లి వెంకటరావు సిరిమానును అధిరోహించనున్నారు. ఈ సంబరంలో సిరిమానుకు ముందు పాలధార, అంజలిరథం, ఏనుగు రథం, బెస్తవాని వల నడుస్తాయి. ముందుగా ఉదయం 11 గంటలకు హుకుంపేటలోని ఆలయ పూజారి ఇంటి వద్ద సిరిమాను బయలుదేరి పుచ్చలవీధి, కన్యకా పరమేశ్వరి ఆలయం, గంటస్థంభం మీదుగా అమ్మవారి ఆలయానికి సంప్రదాయ మేళతాళాల నడుమ చేరుకోనుంది. 12 గంటలకు ఆలయానికి చేరుకునేలా ఇప్పటికే ఏర్పాట్లు చేశారు. సంబరంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తే అవకాశం లేకుండా పోలీసు, మున్సిపల్, రెవెన్యూ, అటవీ, విద్యుత్తు, అగ్నిమాపక, వైద్య ఆరోగ్య, తదితర శాఖలు సమన్వయంగా ముందుకు సాగుతున్నాయి. పండగ నేపథ్యంలో నగరమంతా ముఖ్యంగా చారిత్రక కట్టడాలైన కోట, గంటస్తంభం, ప్రముఖుల విగ్రహాలు విద్యుత్తు కాంతులతో ధగధగా మెరుస్తున్నాయి.

పటిష్ట బందోబస్తు

సిరిమానోత్సవాన్ని శాంతియుతంగా నిర్వహించేందుకు పోలీసుశాఖ 2015 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసింది. ఇద్దరు ఎఎస్‌పిలు, 12 మంది డిఎస్‌పిలు, 58 మంది సిఐలు/ఆర్‌ఐలు, 144మంది ఎస్‌ఐలు/ఆర్‌ఎస్‌ఐలు, 19 మంది మహిళా ఎస్‌ఐలు, ఇతర పోలీసు అధికారులు, స్పెషల్ పార్టీ సిబ్బందితో సహా 2015 మందిని బందోబస్తు నిమిత్తం



వినియోగిస్తున్నారు. మొత్తం బందోబస్తును, కమాండ్ కంట్రోల్ పర్యవేక్షించేందుకు పోలీసు అధికారులను నియమించారు. బందోబస్తు విధుల్లో ఎన్‌సిసి సిబ్బంది సేవలను కూడా వినియోగిస్తున్నారు. ఆలయం ఎదుట తాత్కాలికంగా కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటుచేశారు. బందోబస్తు నిర్వహించే పోలీసు సిబ్బందికి కూడా బాడీ వార్న్ కెమెరాలను అందజేశారు. భద్రతను నిరంతరం పర్యవేక్షించే విధంగా డ్రోన్ కెమెరాలు కూడా వినియోగిస్తున్నారు. సిరిమాను తిరిగే ప్రాంతాల్లో శిథిలావస్థలో ఉన్న 11 భవనాలను గుర్తించి, పైకి ఎవరినీ అనుమతించవద్దని యజమానులకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. అత్యవసర సమయాల్లో స్పందించేందుకుగాను 58 మందితో 7 ప్రత్యేక పోలీసు బృందాలను కమాండ్ కంట్రోల్ వద్ద సిద్ధంగా ఉంచుతున్నారు. భక్తులతో మర్యాదగా ప్రవర్తించాలని సిబ్బందికి ఎస్‌పి దీపిక ఆదేశాలు జారీ చేశారు.

ఉర్రూతలూగించిన మెగా మ్యూజికల్ నైట్

విజయనగర ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా ఏర్పాటు చేసిన మెగా మ్యూజికల్ నైట్ ఉర్రూతలూగించింది. స్థానిక అయోధ్యా మైదానంలో సోమవారం రాత్రి నిర్వహించిన సంగీత, వినోద భరిత కార్యక్రమానికి యువత కేరింతలు కొట్టారు. ప్రముఖ సినీ మ్యూజిక్ డైరెక్టర్ అనూప్ రూబెన్స్ ఆధ్వర్యంలో గాయకులు రాహుల్ సిప్లిగంజ్, జయంత్, సాయి చరణ్, గాయనీమణులు సునీత, లిప్సిక, మోహన భోగరాజు, సాహితి చాగంటి తదితరుల పాటలు హుషారెత్తించాయి. జబర్దస్త్ రాంప్రసాద్ బృందం స్కిట్స్ నవ్వించాయి. విజయవాడ సిద్ధార్థ కళాశాల విద్యార్థినులు డ్రమ్స్ డాన్స్, ప్రభుత్వ సంగీత కళాశాల విద్యార్థినుల నృత్య కార్యక్రమాలు అలరించాయి. శ్యామల యాంకరింగ్ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాలను మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ దీపిక, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, పట్టణ ప్రముఖులు కుటుంబాలతో సహా హాజరై తిలకించారు. ఈ కార్యక్రమానికి వేలాది మంది హాజరయ్యారు.



మ్యూజికల్ నైట్‌లో పాటలు పాడుతున్న అనూప్ రూబెన్స్ బృందం

రైళ్ల రద్దుతో ప్రయాణికుల పాట్లు

● 24 గంటల పాటు స్టేషన్‌లోనే పడిగాపులు ● ఎటువంటి సౌకర్యాలూ కల్పించని రైల్వేశాఖ ● సోమవారం సాయంత్రం రైళ్లు పునరుద్ధరణ ● ఊపిరిపీల్చుకున్న ప్రయాణికులు

జిల్లాలో రైలు ప్రమాదంతో ప్రయాణికులు నానా తంటాలు పడ్డారు. ఈ ప్రమాదం వల్ల ఆదివారం రాత్రి నుంచి సోమవారం రాత్రి వరకూ పలు రైళ్లు రద్దయ్యాయి. దీంతో సుమారు 24 గంటల పాటు ప్రయాణికులు నరకయాతన పడ్డారు. సుదీర్ఘ ప్రాంతాలకు బయలుదేరిన ప్రయాణికులు ఈ ప్రమాదం వల్ల మధ్యలోనే నిలిచిపోవాల్సి వచ్చింది. దీంతో చాలా మంది ప్రయాణికులు రైల్వే స్టేషన్‌లోనే ప్లాట్ ఫారం పైన పిల్లా పాపలతో పడిగాపులు కాశారు. దగ్గర ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు రైళ్లు రద్దు విషయాన్ని తెలుసుకుని ఆర్‌టిసి బస్సుల ద్వారా తమ గమ్యాలకు చేరుకున్నారు. కాగా రైల్వే స్టేషన్‌లో వేచి ఉన్న ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడంలో రైల్వే శాఖ పూర్తిగా విఫలమైంది. కనీసం తాగునీటిని కూడా అందించకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఎట్టకేలకు సోమవారం సాయంత్రం తిరిగి రైళ్లను పునర్ధరించడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

ప్రజాశక్తి - విజయనగరం కోట

కొత్తవలస మండలంలోని కంటకాపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో భీమాలి దగ్గర జరిగిన ఘోర రైలు ప్రమాదంతో విజయనగరం మీదగా వెళ్లాల్సిన పలు రైళ్లు సోమవారం కూడా రద్దయ్యాయి. దీంతో సుధీర ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు రైల్వే స్టేషన్‌లోనే



ప్లాట్‌ఫారంపై నిద్రిస్తున్న ప్రయాణికులు

కాలం వెళ్లదీస్తున్నారు. ఆదివారం రాత్రి 7.10 నిమిషాలకు ప్రమాదం జరిగిన తరువాత కొన్ని రైళ్లను రద్దు చేయగా సోమవారం కూడా మరో 14 రైళ్లను రద్దు చేశారు. 5 రైళ్లను దారి మళ్లించినట్లు అధికారులు వెల్లడించారు. దీంతో సోమవారం చాలా మంది ప్రయాణికులు రైల్వే స్టేషన్‌లోనే ఉండిపోవాల్సి వచ్చింది. కొంత మంది ప్రయాణికులు మాత్రం రైళ్లు రద్దు కావడంతో విజయనగరం నుంచి ఆర్‌టిసి బస్సు ద్వారా తమ గమ్యాలకు బయలుదేరి వెళ్లిపోయారు.

ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు వెళతామో..

రైళ్లు రద్దు కావడంతో చాలా మంది చిన్న పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడ్డారు. గత రెండు రోజులుగా రైల్వే స్టేషన్‌లోనే ఉండిపోవడంతో తాము ప్రయాణించే రైలు ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు ఇంటికి చేరుకుంటామోనని ఆశగా ఎదురు చూస్తున్నారు. అయితే ప్రయాణికులు కోసం రైల్వేశాఖ ఎటువంటి ఏర్పాట్లు చేయకపోవడంతో స్టేషన్‌లోనే అవస్థలు పడ్డారు. కనీసం తాగునీరు వంటివి కూడా ప్రయాణికులకు ఇవ్వకపోవడంతో చాలా మంది చిన్నపిల్లలతో అవస్థలు పడ్డారు.

రైల్వేస్టేషన్‌లో హెల్ప్ డెస్క్

విజయనగరం రైల్వే స్టేషన్‌లో సిటిఐ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేశారు. రాయగడ, భువనేశ్వర్, యశ్వంత్‌పూర్ ప్రాంతాల నుంచి విజయనగరం వరకూ వచ్చిన రైళ్లను ఈ స్టేషన్‌లో నిలిపివేశారు. కంటాకాపల్లి వద్ద ప్రమాదానికి గురైన మూడు లైన్లు పునరుద్ధరణ జరిగిన తరువాత లైన్ క్లియర్ అయితే ఈ రైళ్లను పంపించనున్నారు. సోమవారం ఉదయం 11.30 గంటలకు విజయనగరం వచ్చిన తిరుపతి బిలాస్పూర్, 12.20 గంటలకు విశాఖ భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్, హౌరా యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌ఖ, విశాఖ ఎక్స్‌ప్రెస్‌లను నిలిపివేశారు. కాగా 14 రైళ్లు రద్దు చేయడంతో పాటు మరో ఐదు రైళ్లను దారి మళ్లించారు.

బెంగుళూరు వెళ్లాలి

నేను బెంగుళూరు వెళ్ళడానికి రైల్వే స్టేషన్‌కు వచ్చాను. బెంగుళూరులో ఎంబిఎం చదువుతున్నాను. రైళ్లు సకాలంలో లేకపోవడంతో



కాంప్లెక్స్‌లో బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

రాయపూర్, నాగపూర్ మీదగా దారి మళ్లించారు. ఆ మార్గం గుండా జర్నీ చేయాలంటే చాలా సమయం పడుతోంది. క్లాసులు కూడా అయిపోతాయి. మేనేజ్‌మెంట్ కూడా ఇబ్బందులకు గురిచేస్తోంది.



- రేష్మ, ప్రయాణికురాలు, విజయనగరం

రాయ్‌పూర్ మీదుగా చెన్నై కష్టమే

నేను చెన్నై వెళ్లాలి. విశాఖ నుంచి కాకుండా విజయనగరం నుంచి చెన్నై వెళ్లడానికి వీలుగా ఉంటుందని ఇక్కడకు వచ్చాను. ఈ ప్రమాదం వల్ల ఇప్పుడు రైళు రద్దయ్యాయి. దీంతో చెన్నై ఎలా వెళ్లాలో అర్థం కావడం లేదు. రాయపూర్, నాగపూర్ మీదగా వెళ్ళాలంటే చాలా సమయం పడుతుంది. అక్కడ కుటుంబ సభ్యులు నా కోసం ఎదురు చూస్తూ ఉంటారు.



కల్పన, ప్రయాణికురాలు, విశాఖపట్నం.

రద్దయిన రైళ్ల వివరాలు

రైలు పేరు	నెంబరు
1) కోర్బా – విశాఖ ఎక్స్‌ప్రెస్	(18517)
2) పారాదీప్ – విశాఖ ఎక్స్‌ప్రెస్	(22809)
3) రాయగడ – విశాఖ పాసింజర్	(08503)
4) పలాస – విశాఖ పాసింజర్	(08531)
5) విశాఖ – గునుపుర్ పాసింజర్	(08522)
6)గునుపుర్ – విశాఖ పాసింజర్	(08521)
7) విజయనగరం – విశాఖ మెము స్పెషల్	(07469)
8) విజయవాడ – విశాఖ రత్నాచల్	(12718)
9) విశాఖ – విజయవాడ రత్నాచల్	(12717)
10) గుంటూరు – విశాఖ సింహాద్రి ఎక్స్‌ప్రెస్	(12739)
11) కాకినాడ – విశాఖ మెము ఎక్స్‌ప్రెస్	(17267)
12) విశాఖ – కాకినాడ మెము ఎక్స్‌ప్రెస్	(17268)
13) రాజమండ్రీ – విశాఖ మెము స్పెషల్	(07466)
14) విశాఖ – రాజమండ్రీ మెము స్పెషల్	(07467)
15)కోరాపుట్ – విశాఖ స్పెషల్	(08545)
16) విశాఖ – కోరాపుట్ స్పెషల్	(08546)
17) పలాస – విశాఖ స్పెషల్	(08531)
18) చెన్నై – పూరి ఎక్స్‌ప్రెస్	(22860)
19) రాయగడ – గుంటూరు ఎక్స్‌ప్రెస్	(17244)

స్థలాల అక్రమాలపై చర్యలు తీసుకోండి

కౌన్సిల్ సమావేశంలో వైస్ చైర్మన్ల డిమాండ్

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో ఇళ్ల స్థలాల అక్రమాలపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ వైస్‌చైర్మన్ చెలికాని మురళీకృష్ణ డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ కాలనీ ఎన్ని స్థలాలు పేదలకు ఇచ్చారు, మిగిలిన స్థలాలు ఎవరి చేతిలో ఉన్నాయో వివరాలు కావాలని గత సమావేశంలో అడిగితే ఇంతవరకూ ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ కాలనీ అక్రమాల వెనుక ఎవరి హస్తం ఉందని వెనుకాడుతున్నారని ప్రశ్నించారు. ఇందిరమ్మ కాలనీలో అక్రమాలు జరగడంతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని మరో వైస్ చైర్‌పర్సన్ జి.రమాదేవి అన్నారు. అక్రమాలపై సమగ్ర దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. అక్రమాలపై రెవెన్యూ అధికారులు దర్యాప్తు చేస్తున్నారని, అది పూర్తయిన వెంటనే వివరాలు ఇస్తామని టిపిఒ వరప్రసాద్ అన్నారు. టిడిపి ఫ్లోర్‌లీడర్ గెంబలి శ్రీనివాసరావు మాట్లాడుతూ పూల్‌బాగ్ రోడ్డు బాగు చేయాలని, తమ వార్డులో సామూహిక మరుగుదొడ్లు వినియోగంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి పనుల్లో వివక్షత చూపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడితల్లి కాలనీలో కల్యాణ మండపం స్థలంలో ఇళ్ల పట్టాలు ఇవ్వవద్దని కౌన్సిలర్ కాకల



అధికారులను ప్రశ్నిస్తున్న కౌన్సిలర్లు

గోవిందమ్మ డిమాండ్ చేశారు. తమ వార్డులో తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతున్నా పట్టించుకోలేదని టిడిపి కౌన్సిలర్ వి.హైమావతి మండిపడ్డారు. పట్టణంలో ప్రతి బుధవారం నిర్వహించే సంత కరోనా లాక్‌డౌన్ నుంచి జరగడం లేదని, సంత ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని వైసిపి కౌన్సిలర్లు చోడిగంజి రమేష్ నాయుడు, తెంటు పార్వతి కోరారు. పలు అభివృద్ధి పనులకు ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో వచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని చైర్మన్ మురళి, కమిషనర్ శ్రీనివాసరావు అన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు టిడిపి పరామర్శ

ప్రజాశక్తి- విజయనగరం కోట

రైలు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను జిల్లా సర్వజన ఆస్పత్రిలో టిడిపి నాయకులు సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తక్షణ సహాయం కింది ప్రతి ఒక్కరికీ రూ. 50వేలు నగదు, రూ.9.50లక్షల చెక్కును అందించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం సిఎం వచ్చినప్పటికీ ఇంకా ఎక్స్‌గ్రేషియా చెల్లించకపోవడం దారుణమన్నారు. క్షతగాత్రులను వెంటనే మెరుగైన వైద్యం కోసం కార్పొరేట్ ఆస్పత్రులకు తరలించాలని డిమాండ్ చేశారు. మెట్టవలస, ఎస్‌పి రామచంద్రపురం, జి.సిగడాం గ్రామాలకు చెందిన క్షతగాత్రులను ఎచ్చెర్ల నియోజకవర్గం టిడిపి నాయకులు కలిశెట్టి అప్పలనాయుడు పరామర్శించారు. జనసేన నాయకులు గురాన అయ్యలు క్షతగాత్రులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు కళా వెంకట్రావు, కోండ్రు మురళీ, మాజీ ఎమ్మెల్యేలు కోళ్ల లలిత కుమారి, కొండపల్లి అప్పలనాయుడు, జిల్లా పార్లమెంట్ అధ్యక్షులు కిమిడి నాగార్జున, నెల్లిమర్ల ఇంచార్జ్ కర్రోతు బంగార్రాజు, తదితరులు పాల్గొన్నారు.



క్షతగాత్రులను పరామర్శిస్తున్న టిడిపి నాయకులు

రేపటి నుంచి 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి-బొబ్బిలి

నియోజకవర్గంలో నవంబర్ ఒకటి నుంచి డిసెంబర్ 15 వరకు బాబు షూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టిడిపి నియోజకవర్గ పరిశీలకులు వి.బాబూ రావు, మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన తెలిపారు. కోటలో సోమవారం టిడిపి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ప్రతి గ్రామంలోనూ ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయాలని సూచించారు. ముందుగా రైలు ప్రమాద మృతులకు సంతాపం ప్రకటించారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యని ర్వాహక కార్యదర్శులు అల్లాడ భాస్కరరావు, చింతల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రమాద మృతులకు బేబినాయన సంతాపం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా

రైలు ప్రమాద ఘటనలో మృతులకు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన సంతాపం ప్రకటించారు. రైలు ప్రమాదంపై ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలను ఆదుకోవాలని, గాయపడిన వారికి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.


రాష్ట్ర స్థాయి పోటీలకు గంట్యాడ విద్యార్థులు

ప్రజాశక్తి-గంట్యాడ

నవంబర్ ఒకటో తేదీ నుండి నంద్యాల పట్టణంలో జరిగే రాష్ట్రస్థాయి అండర్-19 ఫెన్సింగ్ పోటీలకు గంట్యాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు బెవరశెట్టి గౌతమ్, ధనికొండ దివాకర్ ఎంపికయ్యారు. వీరిని సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు అలమండి ఝాన్సీ, ఉపాధ్యాయులు, పీడీలు రాజు, శ్రీను అభినందించారు.

క్విజ్‌లో సత్తాచాటిన సాయిజితేంద్ర

వేపాడ: టిసిఎస్ కంపెనీ నిర్వహించిన జాతీయ ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో బక్కునాయుడుపేట వద్దనున్న ఎపి ఆదర్శ పాఠశాల 8వ తరగతి విద్యార్థి ఎన్.సాయి జితేంద్ర నాయుడు సత్తాచాటాడు. రాష్ట్రంలో 26 జిల్లాల నుంచి విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. అందులో ఆరుగురు విద్యార్థులు రీజనల్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అందులో జితేంద్ర కూడా ఉన్నాడు. జితేంద్రను పాఠశాల ప్రిన్సిపల్ రావాడ ఈశ్వరరావు, సిబ్బంది అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు